క్లుప్తంగా

శాంతించిన కుందూ



వంతెనపై కొనసాగుతున్న రాక పోకలు

దొర్నిపాడు: గత రెండు వారాలుగా ఉధృతంగా ప్రవహించిన కుందూ నది ప్రస్తుతం శాంతించింది. దీంతో మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో కుందూ నదిపై నిర్మించిన వంతెన బయట పడింది. రైతులు పొలం పనుల నిమిత్తం వంతెనపై నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన



ఆలమూరులో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన వైద్యాధికారులు

రుద్రవరం/దొర్నిపాడు: పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీసు కోటాను కుదిస్తు తీసుకువచ్చిన జీఓ 85ను ఉప సంహరించుకోవాలని కోరుతూ వైద్యాధికారులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రుద్రవరం మండలంలోని ఆలమూరు, నర్సాపురం, రుద్రవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు అమర్నాథరెడ్డి, గాయిత్రి, బాబు, శ్రావణి, శివమోహన్, దొర్నిపాడు పీహెచ్‌సీలో వైద్యాధికారి నాగేంద్ర తదితరులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ జీఓ 85 వల్ల మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందని, అకస్మాత్తుగా జీఓ మార్చడం అన్యాయమన్నారు. కోటాను 30 నుంచి 15 శాతానికి తగ్గించడం సరి కాదన్నారు.

వర్గీకరణ వద్దు



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ వద్దని, మాలమాదిగలు కలిసి ఉండి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని మాలమహానాడు గౌరవాధ్యక్షులు మేకల లింగస్వామి సూచించారు. వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మంగళవారం స్థానిక పీఎంఆర్ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరగనున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమంలో మాలలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాజ్‌కుమార్, సాంబశివుడు, గుర్రం లక్ష్మి, రోజక్క, చింతలన్న, చంద్రశేఖర్, వైసీ పుల్లయ్య పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి



వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ వామపక్ష పార్టీల నాయకులు మంగళవారం శ్రీనివాస సెంటర్, నూనెపల్లెలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ, సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, పట్టణ కార్యదర్శి గౌస్, సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, ఏఐటీయూసీ కార్యదర్శి ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల క్రీడాకారిణికి కాంస్య పతకం



క్రీడాకారిణిని అభినందిస్తున్న మాస్టర్ అబ్దుల్‌మజీద్

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల క్రీడాకారిణికి కాంస్య పతకం లభించినట్లు మాస్టర్ అబ్దుల్‌మజీద్ మంగళవారం తెలిపారు. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8, 9, 10 తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో జరిగిన సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాల క్రీడాకారిణి మౌనిక అండర్ 26 వెయిట్ కేటగిరిలో కాంస్య పతకం సాధించిందన్నారు. క్రీడాకారిణిని ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ సెక్రటరీలు అభినందించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి 60 మంది బలి

- నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి



నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

బొమ్మలసత్రం: ప్రభుత్వ నిర్లక్ష్యానికి 60 మంది ప్రాణాలు వరద నీటిలో కలిసిపోయాయని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ వరద నీటిలో మునిగిపోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద ముంచెత్తి సుమారు వారం రోజులవుతున్నా బాధితులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. వరద నీరు వస్తుందని ప్రభుత్వానికి ముందే తెలిసినా ప్రజలను అప్రమత్తం చేయటంలో విఫలమయ్యారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండే కరకట్ట బంగ్లాను ఖాళీ చేయించి ఆయనను కలెక్టరేట్‌లో అన్ని వసతులు ఉండే బంగ్లాకు తరలించి ప్రజలను వరదపాలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. విజయవాడ పరిసర ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాక, ప్రజలు తీవ్రంగా నష్టపోయాక బోటులో వెళ్లి ఫొటోలకి ఫోజులివ్వటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంలో 1.45 లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయన్నారు. ఇన్నేళ్లు ముఖ్యమంత్రిగా అనుభవం ఉందని చెప్పుకుంటూ తిరిగే చంద్రబాబు.. ప్రజలను వరదల నుంచి కాపాడలేకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి బాధితులకు అండగా నిలవాలని కోరారు.

నేడు గణేష్ నిమజ్జనం

- చిన్న చెరువు కట్ట వద్ద గణనాథుల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఘాట్ వద్ద, పలు కూడళ్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు
- మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ
- దాదాపు 500 మంది పోలీసు సిబ్బందితో గస్తీ
- నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజకుమారి



వినాయక ఘాట్



ఏర్పాట్ల పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నిమజ్జనాన్ని కనుల పండువగా నిర్వహించడానికి గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ, అధికారులు వినాయక ఘాట్‌ను మంగళవారం తీర్చిదిద్దారు. పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీషా, వార్డు కౌన్సిలర్ పురందర్ పరిశీలించారు. గణేష్ నిమజ్జనం బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటే వరకు ఉంటుందని అంచనా వేసి ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. చెరువు కట్టపై తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఫ్లడ్ లైట్లను, బ్యారికేడ్లను ఏర్పాట్లు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకొచ్చిన విగ్రహాలను చిన్న చెరువులో నిమజ్జనం చేయడానికి ఐదు ర్యాంప్‌లను, ఐదు క్రేన్‌లను ఏర్పాటు చేశారు.

ర్యాలీ ఇలా..

నూనెపల్లె, టెక్కె, సాయిబాబానగర్, ఎన్‌జీఓ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను శ్రీనివాస సెంటర్ మీదుగా బాలాజీ కాంప్లెక్స్, ఫరూక్‌నగర్, ఆత్మకూరు బస్టాండ్ మీదుగా వినాయక ఘాట్‌కు తీసుకొని రావాలి. అక్కడి నుంచి వరుసగా వెళ్లాల్సి ఉంటుంది. రైల్వే స్టేషన్ ఏరియా, మూలసాగరం, బొమ్మలసత్రం ప్రాంతాల్లోని విగ్రహాలను ఆర్టీసీ బస్టాండ్ ద్వారా నేరుగా విక్టోరియా రీడింగ్ రూం వద్దకు చేరాలి. విక్టోరియా రీడింగ్ రూం, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్డు మీదుగా వినాయక ఘాట్‌కు చేరాలి.

ఆంక్షలు ఇవే..

గణేష్ నిమజ్జనం సందర్భంగా పోలీసులు పలు ఆంక్షలు విధించారు. వీధుల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలకు ఉదయమే పూజలు పూర్తి చేసి, నిమజ్జనానికి బయల్దేరాలి. నిర్వాహకులు టపాసులను పేల్చరాదు. కల్పనా సెంటర్ నుంచి వరుస క్రమంలో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకురావాలి. కల్పనా సెంటర్, బైర్మల్‌వీధి, మెయిన్ బజార్, గాంధీచౌక్, పార్కురోడ్ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. 500 మందికి పైగా పోలీసు సిబ్బందిని, 30 మంది విద్యుత్ సిబ్బందిని, పది మంది గజ ఈతగాళ్లు, బోట్లను నిమజ్జన విధులకు కేటాయించారు. జగజ్జననీనగర్, హరిజనవాడ, ఎన్‌జీఓస్ కాలనీ, శ్రీనివాసనగర్, గాంధీనగర్, దేవనగర్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

స్వాగత వేదిక..

గణేష్ విగ్రహాలకు స్వాగతం పలుకుతూ గాంధీచౌక్‌లోని గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ వేదికను ఏర్పాటు చేసింది. మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా, డీఆర్‌ఓ పద్మజ, ఆర్‌డీఓ మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, తహసీల్దార్లు, గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు గంగిశెట్టి విజయ కుమార్ విగ్రహాలకు స్వాగతం పలకనున్నారు.



వినాయక ఘాట్ వద్ద రోడ్డును చదును చేసి, బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

పోలీసులకు సహకరించాలి



నిమజ్జనానికి భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తాం. ప్రశాంతంగా జరగడానికి పలు ఆంక్షలను విధించాం. నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి. ఎలాంటి అల్లర్లుకు పాల్పడినా, ఆంక్షలను ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదు.

– అదిరాజ్‌సింగ్‌రాణా, జిల్లా ఎస్పీ

భక్తిశ్రద్ధలతో గణేష్‌కు వీడ్కోలు

ప్రజలు భక్తి శ్రద్ధలతో గణేష్‌కు సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు, కోలాటాలు, వీడ్కోలు చెప్పడానికి ఏర్పాట్లు చేశాం. గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలి. మద్యం తాగి ఉత్సవాల్లో పాల్గొనడం, అల్లర్లకు పాల్పడటం మంచిది కాదు.

– డాక్టర్ రామకృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు, గణేష్ కేంద్ర ఉత్సవ కమిటీ

ఐలమ్మను ఆదర్శంగా తీసుకుందాం



నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): సాయుధ పోరాటం ద్వారా భూస్వాముల వద్ద ఉన్న లక్షల ఎకరాల భూములను హరిజన, గిరిజన, మైనార్టీ, బీసీలకు పంచిన చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుందామని ఆల్ ఇండియా ధోబీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు జిల్లెల్ల శ్రీరాములు తెలిపారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం ఎర్రజెండా చేతబట్టి పోరాటం చేసిన ధీర వనిత ఐలమ్మ అన్నారు. ఆమె ఆశయాలను నెరవేర్చేందుకు సంఘీయులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, తిరుపాలు, జంబులయ్య, వెంకటేశ్వర్లు, రోసన్న, వెంకటరమణ, కిరణ్ పాల్గొన్నారు.

పంట దెబ్బతిన్న ప్రతి రైతుకు న్యాయం చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇళ్లు, పశు సంపద, రోడ్లు, తదితర ఆస్తి నష్ట వివరాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, తదితర ఆస్తుల నష్టాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ దెబ్బతిన్న పంట పొలాలను లెక్కవేసేందుకు బుధవారం సాయంత్రం వరకు సమయం ఉందని, పూర్తి స్థాయిలో లెక్క కట్టి నివేదికలు తయారు చేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి సోషల్ ఆడిట్ కూడా నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ గోడ పత్రికను మంత్రులు, జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

విద్యా సంస్థలకు నేటి మధ్యాహ్నం సెలవు

నంద్యాల(న్యూటౌన్): గణేష్ నిమజ్జనం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు బుధవారం మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు విద్యార్థులకు భోజనం పెట్టి ఇళ్లకు పంపాలన్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలోనే ఉండి వారికి సంబంధించిన రికార్డు వర్క్ చేసుకోవాలన్నారు. పాఠశాల పని వేళల తర్వాత ఫేస్ యాప్ వేసుకొని వెళ్లాలని సూచించారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

ఆళ్లగడ్డ : గణేశ్ నిమజ్జనం సందర్భంగా తెలుగుగంగ కాలువలో సోమవారం గల్లంతైన బాలుడు లాల్‌బాషా (12) మృతదేహం మంగళవారం లభ్యమైంది. అహోబిలం గ్రామానికి చెందిన లాల్‌బాషా గణేశ్ నిమజ్జన ఉత్సవాల్లో భాగంగా మిత్రులతో కలిసి తెలుగుగంగ కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా గల్లంతయ్యాడు. మంగళవారం గల్లంతైన కొద్దిదూరంలో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై హరిప్రసాద్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

నంద్యాల(అర్బన్): సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకుని, ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ రాజశేఖర్ సూచించారు. పాండురంగాపురం, కానాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి ఈ పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, మద్దతు ధర తదితర ప్రయోజనాలకు అర్హులని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద రావు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత



ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో మానసిక వ్యాధి నిపుణురాలు డాక్టర్ ఆరిఫా భాను, డాక్టర్ మహమ్మద్ రఫీ నిర్వహణలో ర్యాలీ నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదన్నారు. సమస్యలను ధీటుగా ఎదుర్కొని జీవించడమే మనిషి కర్తవ్యమన్నారు. మానసిక వైద్యురాలు డాక్టర్ ఆరిఫాబాను, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా, ఐఎంఏ నంద్యాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి, డాక్టర్ పనీల్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువతి మృతి

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన పర్వీన్(27)అనే యువతి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందింది. ఏఎస్ఐ బాలన్న తెలిపిన వివరాల మేరకు.. అక్కాచెల్లెళ్లు కలిసి పొలానికి వెళ్లి గడ్డి మందు పిచికారీ చేసిరావాలని తండ్రి చెప్పడంతో..ప్రతి సారి నాకే చెప్తారా అని మనస్తాపానికి గురైన పర్వీన్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడివుంది. కొద్ది సేపటికి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్సకై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందరూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తండ్రి మాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆధునిక పద్ధతిలో నీటి క్లోరినేషన్



పైపుద్వారా క్లోరినేషన్ ట్యాబ్‌లెట్ వేస్తున్న దృశ్యం

శిరివెళ్ల: కాలానుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులు అమలులోకి వస్తున్నాయి. ఈ కోవలోనే నీటి క్లోరినేషన్‌కు నూతన పద్ధతి ఆచరణలోకి వచ్చింది. దీనిని స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని నాలుగు వాటర్ ట్యాంక్‌లలో అమలు చేయడం ప్రారంభించారు. సాధారణంగా వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేసిన అనంతరం మోటార్ ద్వారా ట్యాంక్‌లోకి నీటిని పంపింగ్ చేసిన అనంతరం వాటర్ మెన్ ట్యాంక్‌పైకి ఎక్కి బ్లీచింగ్ పౌడర్‌ను బకెట్లలో కలిపి నీటిలోకి పోస్తారు. అయితే కొత్తగా అధికారులు ఇన్ లైన్ క్లోరినేషన్‌ను కనిపెట్టారు. మోటార్ నుంచి ట్యాంక్‌కు మధ్య ప్లాస్టిక్ పైప్‌లో ఐస్ గడ్డలాంటి క్లోరినేషన్ గడ్డను అమర్చుతారు. ట్యాంక్‌లోకి నీరు పంపింగ్ చేసిన ప్రతిసారి ట్యాబ్‌లెట్ (ఐస్ గడ్డ) కొంచెం కొంచెం కరుగుతూ పైపు ద్వారా ట్యాంక్‌లోకి చేరుతుంది. అలా 15 రోజుల వరకు గడ్డ కరుగుతుంది. దీని వలన వాటర్ మెన్ ట్యాంక్ పైకి ఎక్కాల్సిన అవసరం ఉండదు. అలాగే ప్రతి 15 రోజుల కొకసారి క్లోరినేషన్ చేశారా, లేదా అన్న అనుమానాలు అధికారులకు, ప్రజలకు తలెత్తవు. ఈ పద్ధతిని ప్రయోగాత్మకంగా మండల కేంద్రంలో అమలు చేశారు.

సేవలు ప్రారంభం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన భవనాలు
- మంగళవారం నుంచి సేవలు ప్రారంభించిన చాగలమర్రిలోని 2 సచివాలయాలు
- ప్రజలకు అందుబాటులో రుద్రవరం పీహెచ్‌సీ భవనం



వినియోగంలోకి వచ్చిన రుద్రవరం పీహెచ్‌సీ నూతన భవనం

చాగలమర్రి: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మండల కేంద్రమైన చాగలమర్రిలో నిర్మించిన 2 నూతన సచివాలయ భవనాలలో మంగళవారం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 5 సచివాలయ భవనాలు అవసరం కాగా అందులో 4 నూతన భవనాలను నిర్మించింది. అందులో తెలుగుగంగ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన 2 భవనాల నిర్మాణం పూర్తి కావడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కాలంలోనే సచివాలయాలు ప్రారంభమై సేవలందిస్తున్నాయి. కాగా పోలీసుస్టేషన్ సమీపంలో, కోటగడ్డ వీధిలో ఏర్పాటు చేసిన 2 సచివాలయ భవనాల నిర్మాణం పూర్తై అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డిలు లాంఛనంగా ప్రారంభించారు. అయితే అంతలోనే ఎన్నికలు రావడంతో సేవలకు నోచుకోలేదు. అప్పటి నుంచి 4 సచివాలయాల సేవలు తెలుగుగంగ కార్యాలయం సమీపంలో నిర్మించిన సచివాలయ భవనాలలోనే కొనసాగుతుండేవి. అయితే ప్రస్తుతం వాటిలో ఉన్న 1వ సచివాలయాన్ని పోలీసుస్టేషన్ వద్ద ఉన్న నూతన భవనంలోకి, 5వ సచివాలయాన్ని కోటగడ్డ వద్ద నిర్మించిన మరోక భవనంలోకి మార్చి మంగళవారం నుంచి సిబ్బంది సేవలను ప్రారంభించినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు. 2వ సచివాలయ సేవలను సంతమార్కెట్ వద్ద గల పాత సచివాలయంలోనే కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

వినియోగంలోకి నూతన పీహెచ్‌సీ భవనం

రుద్రవరం: మండలంలోని ఆలమూరులో పీహెచ్‌సీ నూతన భవనం మంగళవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. శిథిలావస్థలో ఉన్న పాత భవనంలోని వస్తు సామగ్రిని కొత్త భవనంలోకి మార్చారు. ఎన్నో ఏళ్ల క్రితం ఆలమూరులో పీహెచ్‌సీ భవనం నిర్మించారు. అయితే ఆ భవనం మరమ్మత్తులపై దృష్టి సారించక పోవడంతో ఆ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి పై కప్పు పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. ఆ సమస్యను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నూతన భవన నిర్మాణానికి దాదాపు రూ.1.86 కోట్లు నిధులు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే నూతన భవన నిర్మాణ పనులు పూర్తిచేసి, ఈ ఏడాది జనవరి 19న ప్రారంభించారు. భవన నిర్మాణ పనులు పూర్తి అయినప్పటికీ వైద్యులు అందులో చేరకపోవడంతో సేవలు ప్రారంభంకాలేదు. ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడంతో పాత భవనం కూలుతుందన్న భయంతో వెంటనే కొత్త భవనంలోకి మారారు. దీంతో ప్రజలకు నూనత భవన సేవలు అందుబాటులోకి వచ్చాయి.



కోటగడ్డ వద్ద నిర్మించిన నూతన సచివాలయ భవనం

బాలిక అదృశ్యం

శిరివెళ్ల: యర్రగుంట్లకు చెందిన ఓ మైనర్ బాలిక (17) అదృశ్యమైనట్లు ఎస్ఐ చిన్న పీరయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఉపయో గం లేదు. దీంతో ఆచూకి కోసం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ చదువుతోంది. కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫారం-ఏ అందజేయండి

నంద్యాల(న్యూటౌన్): క్రీడా మైదానాల కోసం ఫారం–ఏ పూర్తిగా నింపి నియోజకవర్గ కో ఆర్డినేటర్‌కు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ శివకుమార్ మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

పోస్టర్ విడుదల

నంద్యాల(న్యూటౌన్): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్ట్ 2024 వాల్‌పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు టాలెంట్ టెస్టులో పాల్గొనాలని జేవీవీ ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి కోరారు. పాఠశాల స్థాయి పరీక్షలు ఈ నెల 25, మండల స్థాయి పరీక్ష అక్టోబర్ 1న, జిల్లా స్థాయి పరీక్ష 27, రాష్ట్రస్థాయి పరీక్షలు నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పీవీ ప్రసాద్, అరవింద్, జాన్సన్, కాశీం, రామకృష్ణుడు పాల్గొన్నారు.